క్లుప్తంగా

11న ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష

గూడూరు రూరల్: మండల పరిధిలోని జూలకల్ ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి సంబంధించి ఈ నెల 11న రాత పరీక్షను నిర్వహించనున్నట్లు ఆదివారం ప్రిన్సిపల్ దిల్షాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆదర్శ పాఠశాలలోనే ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాత పరీక్ష ఉంటుందని ఆమె తెలిపారు.

బురాన్‌దొడ్డిలో ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

సి.బెళగల్: మండల పరిధిలోని బురాన్‌దొడ్డిలోని శ్రీ రాములవారి ఆలయ సమీపాన ఆదివారం శ్రీ లింగమయ్య స్వామి విగ్రహప్రతిష్ఠ ఘనంగా జరిగింది. ముందుగా స్వామివాని విగ్రహంతోపాటు నాభి శిలకు శాస్త్రోక్తంగా పూజలను నిర్వహించారు. ఉదయం గ్రామంలో విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు.

'స్పందన'ను సద్వినియోగం చేసుకోండి

కర్నూలు (న్యూటౌన్): ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించే 'స్పందన' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆర్ శివరాముడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సోమవారం ఉదయం 10గంటల నుంచి 2గంటల వరకు నిర్వహించే 'స్పందన' కార్యక్రమంలో సమస్యలపై వినతిపత్రాలు అందజేస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. 'స్పందన' కార్యక్రమానికి మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని సూచించారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు


గోమాతకు పూజలు చేస్తున్న దృశ్యం

కల్లూరు: మండలంలో ఆదివారం ఏరువాక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. కల్లూరు ఎస్టేట్ శ్రీ అవధూత రామిరెడ్డి తాత గోశాలలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా గోశాల ప్రాంగణంలో గరుకుబండ ప్రతిష్ఠ కార్యక్రమం ఏర్పాటు చేశారు. గోమాత భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అవధూత రామిరెడ్డి తాత సేవా సంస్థానము ఆ స్థాన పండితులైన పవన్ కుమార్ స్వామి, గోశాల అధ్యక్షుడు దాసరి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు.

సి.బెళగల్: మండల ప్రజలు ఆదివారం ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా జరిగాయి. గ్రామ దేవతలు మారెమ్మ అమ్మవారు, గంగమ్మ అమ్మవార్లకు భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వృషభాలను అలంకరించి ప్రత్యేక పూజను చేశారు.

విద్యా కానుకల పరిశీలన

గడివేముల: ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల పాఠశాలల ప్రారంభం రోజునే జగనన్న విద్యాకానుకలను అందించేందుకు సిద్ధం చేస్తున్నట్లు ఎంఈఓ రామకృష్ణుడు తెలిపారు. మండల కేంద్రం గడివేముల జెడ్పీ హైస్కూల్‌లో నిల్వ ఉంచిన విద్యాకానులను ఆదివారం ఎంఈఓ పరిశీలించారు. ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు ఉచితంగా విద్యాకానుక కిట్లు అందజేస్తామని ఎంఈఓ తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్‌కు ఆహ్వానం


కాటసాని శివనరసింహారెడ్డితో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహకులు, ఓర్వకల్లు మండల యువకులు

కల్లూరు: కేఎస్ఎన్ఆర్ సమ్మర్ స్పెషల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఓర్వకల్లులో త్వరలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్య అతిథులుగా హాజరుకావాలని క్రికెట్ టోర్నమెంట్ నిర్వహకులు, ఓర్వకల్లు మండల యువత ఆదివారం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తనయుడు కాటసాని శివనరసింహారెడ్డిని ఆహ్వానించారు.

హైదరాబాద్‌కు వెళ్లి పింఛన్ అందజేత


హైదరాబాద్‌లో రమణమ్మ వేలిముద్ర తీసుకుంటున్న వలంటీర్ ప్రతాప్‌కుమార్

కర్నూలు (న్యూటౌన్): ఈ ఫొటోలో కనిపిస్తున్న గొల్ల రమణమ్మ స్వగ్రామం కర్నూలు మండలం గార్గేయపురం. అయితే ప్రస్తుతం ఆమె నడవలేని పరిస్థితిలో హైదరాబాద్‌లో తన కుమారులు వెంకటరమణ, రమేష్ వద్ద నివాసం ఉంటున్నారు. మానవతా ధృక్పథంతో గార్గేయపురానికి చెందిన చెందిన వలంటీర్ పైగేరి ప్రతాప్‌కుమార్ హైదరాబాద్‌కు వెళ్లి గొల్ల రమణమ్మ (వితంతువు)కు వైఎస్సార్ పింఛన్ రూ.2,750 నగదును అందజేశాడు. దీంతో రమణమ్మ వలంటీర్‌తోపాటు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

మెరుస్తున్న రహదారులు!

- రూ.2.50 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణం
- గ్రామీణులకు తీరిన రహదారి కష్టాలు
- మెరుగుపడిన రవాణా సదుపాయాలు


సోమయాజులపల్లె నుంచి కొమరోలు వరకు నూతనంగా వేసిన బీటీ రోడ్డు

ఓర్వకల్లు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రోడ్లకు మోక్షం చేకూరింది. ఏళ్లతరబడి కనీసం మరమ్మతలకు నోచుకోని రహదారులు నేడు మెరుస్తున్నాయి. మారుమూల ప్రాంతాలకూ కొత్త రోడ్లను నిర్మించడంతో పల్లెలు ప్రగతి పథంలో నడుస్తున్నాయి. ఒకప్పుడు రహదారులు సక్రమంగా లేక ప్రజలు చాలా అవస్థలు పడేవారు. పదేళ్ల క్రితం నిర్మించిన రోడ్లపై గుంతలు ఏర్పడి రాకపోకలకు ప్రజలు నానాకష్టాలు పడ్డారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చొరవతో కొత్త రోడ్లకు శ్రీకారం చుట్టి, గ్రామీణ వాసులకు రాచమార్గం వేశారు. మండలంలో వేర్వేరు ప్రాంతాలలో రూ.2.50 కోట్లు పంచాయతీ రాజ్ నిధులను ఖర్చుపెట్టి రోడ్లను అభివృద్ధిబాటలో నడిపించారు. ఎస్.కొంతలపాడు నుంచి ఉప్పలపాడు క్రాస్ రోడ్డు వరకు రూ.20 లక్షలతో బీటీ రోడ్డును నిర్మించారు. గతంలో ఈ రహదారిపై కంకర రాళ్లుతేలి గుంతలమయంగా ఉండేది. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో పరిష్కారం లభించింది. ఉయ్యాలవాడ, ఉప్పలపాడు గ్రామస్తులు మండల కేంద్రానికి రావడానికి ఈ రహదారి ఎంతో అనుకూలంగా మారింది. కాల్వబుగ్గ నుంచి గుడుంబాయితండా వరకు రూ.79 లక్షలతో బీటీ రోడ్డు నిర్మించారు. ప్రతి అమవాస్య, పౌర్ణమి రోజుల్లో వేలాది మంది భక్తులు కొమ్ముచెరువు ఆంజనేయస్వామిని దర్శనార్థం వస్తుంటారు. ఈ రహదారిని అభివృద్ధి చేయడంతో అటు తండా ప్రజలకు, ఇటు భక్తులకు సౌకర్యంగా మారింది. అలాగే కాల్వబుగ్గ గురుకుల పాఠశాల నుంచి పాలకొలను మీదుగా చింతలపల్లె వరకు రూ.1.20 కోట్లతో తారు రోడ్డు వేశారు. గతంలో చీకటి పడితే ఈ రహదారిపై ప్రయాణం చాలా కష్టం . ఆయా గ్రామాల ప్రజలు ఈ మార్గం ద్వారానే హుసేనాపురం చేరుకొని అక్కడి నుంచి మండల, జిల్లా కేంద్రాలకు చేరుకుంటారు. ప్రస్తుతం కొత్త రోడ్డు నిర్మించడంతో అర్ధరాత్రి వేళల్లో కూడ వాహనదారులు సాఫీగా ప్రయాణం కొనసాగిస్తున్నారు. ఇకపోతే సోమయాజులపల్లె నుంచి కొమరోలు వరకు కొత్త బీటీ రోడ్డును రూ.40లక్షలతో నిర్మించారు. గతంలో ఈ రోడ్డు పరిస్థితి చాలా అధ్వానం. సమస్యను ఎమ్మెల్యే కాటసాని దృష్టికి తీసుకెళ్లడంతో పరిష్కరించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా పండ్ల తోటలు, ఆరటి తోటలు ఉండడంతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది.

ప్రయాణం సులభతరమైంది



మా ఊరు ఉప్పలపాడు. కొంతలపాడు మీదుగా ఓర్వకల్లుకు వెళ్లడానికి ప్రయాణం సులభతరమైంది. లేదంటే ఉయ్యాలవాడ, లొద్దిపల్లె, నన్నూరు గ్రామాల మీదుగా ఓర్వకల్లుకు చేరుకునేవాళ్లం. ఇంకోవిధంగా హుసేనాపురం మీదుగా వెళ్లాల్సివచ్చేది. ప్రస్తుతం కొంతలపాడు వద్ద దెబ్బతిన్న రోడ్డును బాగుచేయడంతో ప్రయాణ దూరం తగ్గడమే గాక, తక్కువ సమయంలో ఓర్వకల్లుకు చేరుకుంటున్నాం. రోడ్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సాయం మరువం.

– దొమ్మరి మధు, ఉప్పలపాడు

రోడ్డు కష్టాలు తీరాయి



మా గ్రామం కొమరోలు. రోడ్డు సరిగా లేక నరకయాతన పడేవాళ్లం. ప్రస్తుతం కొత్తగా తారు రోడ్డు వేయంతో ప్రయాణ కష్టాలు తొలగాయి. సోమయాజులపల్లెకు వెళ్లాలంటే భయపేవాళ్లం. ఇప్పుడు ఎన్నిసార్లు ప్రయాణం చేయాలన్నా ఇబ్బందిగా లేదు. ఈ రోడ్డు నిర్మించడంతో మా గ్రామంతో పాటు, బేతంచెర్ల మండలంలోని యంబాయి, రుద్రవరం ప్రాంతాల ప్రజలు ఇదే రహదారిపై ప్రయాణిస్తున్నారు. ఎక్కువ శాతం కూరగాయలు, పండ్లు సాగు చేయడంతో వీటిని అమ్ముకోవడానికి ఆటోల ద్వారా మార్కెట్‌కు తీసుకెళ్లేందుకు ఇబ్బందిగా ఉండేది. రోడ్డు నిర్మిచడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. – మంగళి. శేషు, కొమరోలు

రాకపోకలకు ఇబ్బందులు తొలిగాయి



మాది చింతపల్లె గ్రామం. ఒకప్పుడు మా ఊరు పాలకొలను గ్రామ పంచాయతీ పరిధిలో ఉండేది. ప్రస్తుతం జగన్ ప్రభుత్వం వచ్చాక ప్రత్యేక గ్రామ పంచాయతీగా చేయడం సంతోషంగా ఉంది. పెద్దల మాట ప్రకారం రోడ్లు బాగుంటేనే ఊర్లు బాగుంటాయనేది వాస్తవం. ఒకప్పుడు మా ఊరికి రోడ్డు మార్గం లేక సుమారు 8 కిలోమీటర్ల దూరం కాలినడకన హుసేనాపురం గ్రామానికి చేరుకొని అక్కడి నుంచి అవసరమైన ప్రాంతాలకు వెళ్లేవాళ్లం. రోడ్డు సరిగా లేక పోవడంతో రాత్రి ప్రయాణం చేసేవారుకాదు. ప్రస్తుతం నిత్యం రాకపోకలు చేస్తున్నారు.రహదారి సమస్యలను తీర్చిన ఎమ్మెల్యే కాటసాని సాయం మరువం. – పెద్ద గిడ్డయ్య, చింతలపల్లె

నేడు కోడుమూరులో స్పందన

కోడుమూరు రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శేషఫణి ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు ఏవైనా సమస్యలుంటే అర్జీల రూపంలో సమర్పిస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.

సి.బెళగల్: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరవ్వాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ ఆదివారం ప్రకటనలో సూచించారు. అన్నారు. స్పందనకు గైర్హాజరయ్యే అధికారులపై ఉన్నతాధికారులకు చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గూడూరు: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి అధికారులు హాజరు కావాలని తహసీల్దార్ ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించే కార్యక్రమానికి గైర్హాజరయ్యే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు గోరంట్లలో గడప గడపకు మన ప్రభుత్వం

కోడుమూరు రూరల్ : మండలంలోని గోరంట్ల గ్రామంలో సోమవారం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు వివరిస్తారన్నారు. అదేవిధంగా ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కార చర్యలు చేపడుతారన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటరీలు పాల్గొనాలని ఎంపీడీఓ సూచించారు.

నేడు బాలాజీనగర్‌లో

కర్నూలు (న్యూటౌన్): స్థానిక బాలాజీనగర్‌తో పాటు కోడుమూరు మండలం గోరంట్ల గ్రామంలో ఈ నెల 5వ తేదీన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ కార్యాలయ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారన్నారు. అదేవిధంగా ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్‌ను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పకుండా హాజరు కావాలని పేర్కొన్నారు.


ఆకట్టుకుంటున్న సుంకేసుల పూలు

కల్లూరు: జాతీయ రహదారి(44) రోడ్డుకు ఇరువైపులా ఉన్న సుంకేసుల చెట్లకు పూలు విరగబూసాయి. రోడ్డుకు ఇరువైపులా పచ్చదనం కప్పేసినట్లు దర్శనమిస్తున్నాయి. పచ్చగా కళకళలాడుతున్నాయి. ఈ రహదారిపై ప్రయాణించి వాహనచోదకులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. సుంకేసుల పూల చెట్లు ప్రతిఒక్కరినీ ఆకట్టుకుంటున్నాయి.

గోరుకల్లు జలాశయంపై సీఎంకు ఎమ్మెల్యే లేఖ


కట్టను పరిశీలిస్తున్న మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి

పాణ్యం: గోరుకల్లు జలాశయ కట్ట కుంగిపోవడంపై ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఫొటోలతో కూడిన లేఖను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాశారని, అలాగే ఇటీవల కర్నూలు జిల్లా పర్యటనకు వచ్చిన సీఎంకు వినతి పత్రం అందించారని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే సూచనల మేరకు రైతులతో కలిసి ఆయన కుంగిన కట్టను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంతో మాట్లాడి మరమ్మతులకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోరారన్నారు. అధికారులు తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇరిగేషన్‌లో అధికారులు పనులు చేపడతారన్నారు. కార్యక్రమంలో గగ్గటూరు శ్రీనివాసరెడ్డి, శంకర్‌రెడ్డి, భాస్కర్, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు ఎంపీడీఓగా అజాంఖాన్


అజాంఖాన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధికారులు, పంచాయతీ కార్యదర్శులు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండల ఎంపీడీఓగా అజాంఖాన్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అవుకు ఎంపీడీఓగా విధులు నిర్వర్తించే ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. జెడ్పీలోని కర్నూలు ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓ భాస్కర్ నాయుడు, పీఆర్ ఏఈ రవిమోహన్‌రెడ్డి, ఈఓఆర్‌డీ నాగేశ్వర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ అమరేంద్ర, జూనియర్ అసిస్టెంట్ వినోద్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు హేమంత్‌కుమార్‌రెడ్డి, జాకీర్‌హుస్సేన్, పురుషోత్తం, గోవిందు, లక్ష్మీనాథ్, కృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ అజాంఖాన్ చేతులమీదుగా కేక్ కట్ చేయించి ఒకరినొకరు తినిపించుకుని సంతోషాన్ని పంచుకున్నారు.

కొమ్మకొమ్మకో గబ్బిలం!


చింత చెట్టుకు వేలాడుతున్న గబ్బిలాలు

కోడుమూరు: కోడుమూరు పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహాల దగ్గర ఉన్న చింతచెట్టుకు వందలాది గబ్బిలాలు వేలాడుతున్నాయి. కొమ్మకొమ్మకో గబ్బిలం అన్నట్లుగా ఉంది. గబ్బిలాలు వేలాడుతున్న దృశ్యాలను ప్రజలు వింతగా చూస్తున్నారు. భయంతో కూడిన ఉత్సాహంతో ఆసక్తిగా తిలకిస్తున్నారు జనం.

ఆయుష్మాన్ హెల్త్ కార్డులు అందరికీ ఇవ్వాలి


మాట్లాడుతున్న డాక్టర్ సి. ప్రభాకరరెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డులు అందరికీ ఇచ్చి పోర్టబులిటీ సౌకర్యం కల్పించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి యోజన, వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ఎంపానల్ హాస్పిటల్‌కు సంబంధించి కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ఆరోగ్య సహాయ మంత్రి ఎస్పీ సింగ్ బగీలాతో పాటు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని హాజరైన ఈ సమావేశంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గురించి డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి వివరించారు. ప్రసవాల కోసం తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల ప్రజలు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వస్తుంటారని, వారికి ఆయుష్మాన్ భారత్, తెలంగాణ ఆరోగ్యశ్రీ కార్డులు ఇక్కడ చెల్లుబాటు కావన్నారు. దీనివల్ల వారు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అంతేగాక జాతీయ రహదారి 44 కర్నూలు మీదుగా వెళ్తుందని, ఇక్కడ జరిగే రహదారి ప్రమాదాల్లో గాయపడిన వ్యక్తులకు సత్వర వైద్య సదుపాయం అందించేందుకు ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డులు అందరికీ ఇచ్చేటట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్ టాపర్‌గా కర్నూలు విద్యార్థి

కర్నూలు(హాస్పిటల్): ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ప్రవేశపరీక్షలో కర్నూలుకు చెందిన విద్యార్థి డాక్టర్ పెరుగు ప్రణీత్‌రెడ్డి మొదటి ర్యాంకు సాధించాడు. స్థానిక మాధవీనగర్‌కు చెందిన పెరుగు పురుషోత్తమరెడ్డి కుమారుడైన ప్రణీత్‌రెడ్డి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఇటీవల జనరల్ సర్జరీలో పీజీ పూర్తి చేశాడు. జూనియర్ డాక్టర్ల సంఘానికి అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. ఎయిమ్స్ ప్రవేశ పరీక్ష రాసి మొదటి ర్యాంకు సాధించి సత్తాచాటాడు. ఈ మేరకు ఆయన చండీఘడ్‌లోని ఎయిమ్స్‌లో రీనల్ ప్లాంట్ సర్జరీ (కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స) కోర్సును సూపర్‌స్పెషాలిటీ విద్యలో భాగంగా ఎంపిక చేసుకున్నాడు. అతడిని కర్నూలు మెడికల్ కాలేజీ అధికారులు, వైద్యులు శుభాకాంక్షలు తెలిపారు.

ఉన్నత విద్యను అభ్యసిస్తేనే ఉజ్వల భవిష్యత్తు


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేసిన దృశ్యం

- నంద్యాల అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు

కర్నూలు (న్యూటౌన్): విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసిస్తేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని నంద్యాల అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు సూచించారు. స్థానిక జెడ్పీలోని కర్నూలు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో కురువ విద్యార్థుల ప్రతిభా పురస్కారాలకు ప్రదానోత్సవం కార్యక్రమానికి కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నంద్యాల అడిషనల్ ఎస్పీతో పాటు డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు, సీఐ మంజుల, అమీలియో హాస్పిటల్ అధినేత ప్రసాద్ హాజరయ్యారు. కర్నూలు ఉమ్మడి జిల్లాకు చెందిన 10వ తరగతిలో 500 మార్కులకుపైగా, ఇంటర్ సెకెండ్ ఇయర్‌లో 900 మార్కులకు పైగా సాధించిన 58 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమోంటోలు, నగదు బహుమతులను అతిథుల చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుతోనే పేదరిక నిర్మూలన సాధ్యమనే విషయాన్ని ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కురువ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, అసోసియేట్ అధ్యక్షులు గుడిసె శివన్న, అధ్యక్షుడు కిష్టన్న, ఉపాధ్యక్షులు శంకర్, గడ్డం రామకృష్ణ, నగర అధ్యక్షుడు తవుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కేవీఆర్‌లో స్థల వివాదం కొలిక్కి

- 2012 నుంచి డిగ్రీ, జూనియర్ కాలేజీ మధ్య స్థల సమస్య
- జిల్లా కలెక్టర్ చొరవతో వివాదం పరిష్కారం
- ఎట్టకేలకు జూనియర్ కాలేజీకి స్థలం స్వాధీనం
- నాడు–నేడు పనులకు తొలగిన అడ్డంకి


నగరంలోని కేవీఆర్ జూనియర్ కాలేజీ

కర్నూలు సిటీ: కేవీఆర్ డిగ్రీ, జూనియర్ కాలేజీల మధ్య స్థల వివాదం సమిసినట్టే. దశాబ్దకాలంగా సాగిన ఈ సమస్యను జిల్లా కలెక్టర్ డా.జి సృజన ప్రత్యేక చొరవ తీసుకుని పరిష్కరించడంతో నాడు–నేడు పనులకు అడ్డంకి కూడా తొలగింది.

ఇదీ నేపథ్యం..

కేవీఆర్ జూనియర్ కాలేజీ 1958లో ప్రీ యూనివర్సిటీ కోర్సుగా ప్రారంభమైంది. 1962–63 విద్యా సంవత్సరంలో డిగ్రీ కాలేజీగా అప్‌గ్రేడ్ అయ్యింది. 1969లో ఇంటర్మీడియెట్‌గా మార్పు చేయగా, 1996లో కాంపొజిట్ కాలేజీగా డిగ్రీ పరిధిలోనే జూనియర్ కాలేజీ ఉండేది. డిగ్రీ, ఇంటర్ వేరుగా చేసినప్పుడు స్థలం, స్టాఫ్ విభజన చేయకపోగా, 2012లో జూనియర్ కాలేజీ విద్యార్థులకు హాస్టల్‌ను తొలగించారు. దీనిపై జూనియర్ కాలేజీ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తూ తమకు న్యాయం చేయాలని కోరుతూ 2015లో పోస్టుకార్డులు రాసి హైకోర్టుకు పంపారు. ఫిర్యాదుగా స్వీకరించి విచారణ చేపట్టిన హైకోర్టు జూనియర్ కాలేజీకి ఎకరం స్థలం, హాస్టల్ సదుపాయం కల్పించాలని 2016లో తీర్పు ఇచ్చింది. ఇది అమలు కాకపోవడంతో విద్యార్థులు మరోసారి కోర్టును ఆశ్రయించగా వెంటనే కాలేజీలోని నార్త్ వెస్ట్‌లో 2 ఎకరాలు కేటాయించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు 2019లో స్థలాన్ని కల్లూరు తహసీల్దారు కొలతలు వేసి స్వాధీనం చేశారు. ప్రస్తుతం జూనియర్ కాలేజీకి నాడు–నేడు పనుల కింద రూ.94 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో టాయిలెట్లు, తరగతి గదుల్లో మేజర్, మైనర్ రిపేర్లతో పాటు రక్షణగోడ నిర్మాణం చేయాలి. అయితే, ఈ పనులకు డిగ్రీ కాలేజీ వారు అడ్డుకోవడంతో మళ్లీ సమస్య మొదటికొచ్చింది. ఇటీవల కలెక్టర్ సృజన నిర్వహించిన సమీక్షలో స్థల వివాదం గురించి తెలియడంతో సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. డిగ్రీ, జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లతో మాట్లాడి వివాదాన్ని పరిష్కరించాలని సూచించడంతో కర్నూలు ఆర్డీఓ, సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్, ఇంజనీర్లు కాలేజీకి వెళ్లి స్థలాన్ని జూనియర్ కళాశాలకు స్వాధీనం చేశారు. దీంతో నాడు–నేడు పనులతో పాటు తరగతి గదుల నిర్మాణాలకు అడ్డంకులు తొలగిపోయాయి.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఉద్యోగి మృతి

కర్నూలు (టౌన్): నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని ఆధిత్యనగర్‌లో నివసించే రాఘవేంద్ర స్థానిక పెద్దమార్కెట్ బాలికల ఉర్దూ ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం వ్యక్తిగత పని మీద ద్విచక్ర వాహనంపై వెళ్తూ అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఈమేరకు మృతుడి భార్య వెంకటేశ్వరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

కర్నూలు (టౌన్): పత్తికొండ టౌన్‌కు చెందిన మురళీ (23) కర్నూలు నగరంలోని చెన్నమ్మ సర్కిల్‌లో నివసిస్తున్నాడు. వృత్తిరీత్యా డ్రైవర్. కర్నూలు పట్టణానికి చెందిన అంబికా అనే యువతిని 2021 సంవత్సరంలో ప్రేమ వివాహం చేసుకున్నాడు. బళ్లారిలో కాపురం పెట్టాలనే విషయంలో ఇరువురి మధ్య కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఇదే విషయంపై ఆదివారం మరోసారి గొడవ జరగడంతో తీవ్ర మనస్థాపానికి గురైన మురళీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. అక్క శిరీషా ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కర్నూలు (టౌన్): బండిమెట్టలో నివసించే ఖాజాబాషా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈయనకు భార్య, ముగ్గురు ఆడపిల్లలు. పెద్దకూతురుకు వివాహమైంది. రెండవ కూతురుకు పెళ్లి కుదిరింది. అయితే, డబ్బుల సమస్య ఉండటంతో తీవ్ర మనస్థాపం చెందాడు. గత నెల 29 వ తేదీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. భార్య రెహానా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సప్లయర్స్ షాపులో అగ్నిప్రమాదం

ఆలూరు రూరల్: పట్టణంలోని కర్నూలు–బళ్లారి ప్రధాన రహదారిలోని ఓ సప్లయర్స్ షాపులో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ప్రమాదంలో రూ.3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు నాగరాజు వాపోయాడు. ఆదివారం ఉదయం 6 గంటలకు షాపులో భారీ ఎత్తున మంటలు చెలరేగడంతో షామియానాలు, డెకరేషన్ సామగ్రితో పాటు ఇతర సప్లయర్స్ సామగ్రి కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలు అదుపు చేయడంతో ప్రాణ నష్టం తప్పింది. షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్నిప్రమాదం జరిగినట్లు ఫైర్ అధికారి ఖాద్రి తెలిపారు.

వృద్ధాప్యం శాపం కాకూడదు

కర్నూలు(హాస్పిటల్): మలివయసులో తల్లిదండ్రులకు వృద్ధాప్యం శాపం కాకూడదని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి. శంకరశర్మ చెప్పారు. ఆదివారం ఆయన స్థానిక బి.క్యాంపులోని మన వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచీకరణ నూతన ఆర్థిక, సామాజిక అంశాలు ఉమ్మడి కుటుంబ వ్యవస్థను చిన్నాభిన్నం చేశాయని, వృద్ధాప్య తల్లిదండ్రుల సంక్షేమాన్ని తమ బాధ్యతగా భావించాలన్నారు.

వాస్తవికతతో రచనలు

కర్నూలు కల్చరల్: సామాజిక వాస్తవికతతో సాహిత్య రచనలు చేసిన తొలితరం కథకులు ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి అని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు. ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో కేతు విశ్వనాథరెడ్డి సంతాప సభ జరిగింది. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాహితీ వేత్తలు పాణి, వెంకటకృష్ణ మాట్లాడుతూ ఆధునిక కథా సాహిత్యంలో కేతు విశ్వనాథరెడ్డి మార్క్సిస్ట్ ముద్ర వేశారన్నారు. కథాసాహిత్యంలో అనావృష్టి, ఫ్యాక్షన్, దళిత సమస్యలు, స్త్రీవేదనలు కథలుగా రాశారని ఇందులో మార్పుకు అవకాశం ఉన్న శక్తులను అన్వేషించారన్నారు. సాహితీ స్రవంతి అధ్యక్షుడు కెంగార మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కవులు, రచయితలు ఇనాయతుల్లా, అజీజ్, మారుతి, చౌశా, రాంచంద్, సయ్యద్ జహీర్ అహ్మద్, ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.